ఈనాడు
జోగులాంబ గద్వాల

బహుళ ప్రయోజనం.. నేడు నిరుపయోగం!



గద్వాల మండలం గుర్రంగడ్డలో నిర్మించిన ఫంక్షన్‌హాల్

ధరూరు మండలంలో అసంపూర్తిగా..

ధరూరు, గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఒకప్పుడు కేవలం జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో మాత్రమే ఫంక్షన్ హాల్స్ కనిపించేవి. కాలం మారింది. ఇప్పుడివి పల్లెలకూ వ్యాపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కింది, మధ్య తరగతి ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా గద్వాల నియోజకవర్గంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎస్‌డీఎఫ్ నిధులతో పెద్ద ఎత్తున బహుళ ప్రయోజన ఫంక్షన్ హాల్స్ నిర్మాణం చేపట్టారు. పూర్తయిన చోట్ల ఉపయోగించుకోక, కొన్ని చోట్ల అసంపూర్తిగా ఇవి దాదాపు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఎక్కడాలేని విధంగా

ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేని విధంగా గద్వాల నియోజకవర్గంలో నిరుపేదలు వివాహాది శుభకార్యాలు చేసుకునేందుకు ఎంపిక చేసిన గ్రామాల్లో ఎస్‌డీఎఫ్(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్) కింద ఫంక్షన్‌హాల్స్ నిర్మించారు. వీటి నిర్మాణానికి అప్పటి సీఎంతో కేసీఆర్ ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ప్రత్యేక నిధులు కేటాయించేలా చొరవచూపారు. నియోజకవర్గంలో 262 హాళ్ల నిర్మాణానికి రూ.57.34 కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించి మరీ నిర్మించారు. 2020-21వ ఆర్థిక సంవత్సరంలో వీటిని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన గ్రామాల్లో జనాభా ఆధారంగా రెండు నుంచి మూడు హాల్స్ నిర్మించారు. మండల కేంద్రాలయిన మల్దకల్, గట్టు, ధరూర్, కేటిదొడ్డిలలో రూ.25 లక్షలతో వీటిని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. బీసీ, మల్టీపర్పస్‌లకు రూ.21.5 లక్షలు, ఎస్సీలకు రూ.20లక్షల చొప్పున గ్రామాల్లో హాళ్ల నిర్మాణానికి పూనుకున్నారు. కాగా వాటిలో ఇంకా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. వీలయినంత త్వరగా పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పేదలకు ఉపయుక్తం

నిరుపేద కుటుంబాల్లో వివాహాలు, ఇతర శుభకార్యాలు చేయాలంటే ఏర్పాట్లకు వేలాది రూపాయలు అవుతున్న తరుణంలో వీటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తే చాలా వరకు ఖర్చు తగ్గుతుంది. కానీ పంచాయతీల పాలకులు, సిబ్బంది తగిన చర్యలు చేపట్టక నిరుపయోగంగా ఉంటున్నాయి. తాగునీటి వసతి ఇతర మౌలిక సదుపాయాలపై దృష్టి సారించి వాటిని అందుబాటులోకి తెస్తేనే వీటి వినియోగం పూర్తి స్థాయిలో ఉంటుందని గ్రామీణ ప్రజలంటున్నారు.

వినియోగంలోకి తెస్తాం: బహుళ ప్రయోజనాలతో వీటిని నిర్మించాం. అసంపూర్తిగా ఉన్నవాటికి నిధులు మంజూరు చేయించి పూర్తి చేయించటమే కాకుండా పూర్తయిన వాటిని వినియోగంలోకి తెచ్చేలా చూస్తాం. సర్పంచి ఎన్నికలు పూర్తయి పాలక వర్గాలు ఏర్పడితే ప్రత్యేకంగా చొరవ తీసుకోని వాటికి తగిన మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు చేపడుతాం. ఎక్కడైనా వీటిని దుర్వినియోగం చేస్తే మా దృష్టికి తీసుకొస్తే కఠినచర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలిస్తాం.

-బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, గద్వాల

ఘనంగా రాజరాజేశ్వరీదేవి కల్యాణం



వధూవరులుగా స్వామి, అమ్మవార్లు

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: గద్వాలలోని మార్కండేయస్వామి దేవాలయంలో గురువారం పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో రాజరాజేశ్వరీదేవి, భవాని శంకర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు మూల విగ్రహం, ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, 10 గంటలకు చండీ హోమం, మధ్యాహ్నం కల్యాణం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

ఆగని తవ్వకాలు

ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా క్వారీల్లో అక్రమాలు



జడ్చర్లలోని శంకరాయపల్లి గుట్టలోని క్వారీ పరిస్థితి

ఈనాడు, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని మైనింగ్ అక్రమాలపై ఇటీవల వచ్చిన ఫిర్యాదులు, విచారణలు చర్చనీయాశంగా మారాయి. గతంలో ఇక్కడ పని చేసిన ఆ శాఖ ఏడీ సస్పెన్షన్‌కు గురి కావడం, జడ్చర్ల సమీపంలోని శంకరాయపల్లిలో తవ్వకాలపై ఉన్నతాధికారుల విచారణతో మరోసారి గనుల అక్రమాలు తెరపైకి వచ్చాయి. గత కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో మైనింగ్ వ్యాపారం నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నా పట్టించుకొనే నాథుడే కరవయ్యారు. అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వుతూ కొందరు నిర్వాహకులు రూ.కోట్లు దండుకొంటున్నారు. వీరికి కొందరు అధికారులు సహకరిస్తుండటంతో అక్రమాలకు అడ్డే లేకుండాపోతోంది.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 285 క్వారీలకు అనుమతులిచ్చారు. వీటిలో క్వార్ట్జ్, ఫెల్స్‌ఫార్, స్టోన్ అండ్ మెటల్, కలర్ గ్రానైట్, బ్లాక్ గ్రానైట్, మొరం వంటి వాటికి మైనింగ్ శాఖ అనుమతులిచ్చింది. పలు క్వారీల్లో అనుమతులు తీసుకున్న దాని కంటే అధికంగా గుట్టలను తవ్వేస్తున్నారు. టన్ను రాయికి రూ.80, మొరం మట్టికి రూ.35 రాయల్టీ చెల్లించాలి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కానీ సీఎం సొంత జిల్లాలోనే ఈ అక్రమాలు ఆగడం లేదు.

సర్వే పేరుతో కాలయాపన..: పాలమూరులో ఎక్కడెక్కడ మైనింగ్ పేరుతో అక్రమంగా క్వారీలు తవ్వి అక్రమంగా తరలిస్తున్నారో ఆ శాఖకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. కొన్ని చోట్ల మైనింగ్ శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది ఎక్కడ అక్రమాలు జరుగుతాయో అక్కడ వాలిపోతారన్న విమర్శలు ఉన్నాయి. అయినా అక్రమార్కులపై చర్యలు మాత్రం ఉండవు. ఎక్కడైనా ఆరోపణలొస్తే డీజీపీఎస్ సర్వే చేపడుతున్నామని అక్రమాలు అందులో వెల్లడవుతాయని చెప్పి తప్పించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మైనింగ్ శాఖకు చెందిన పలువురు అధికారులు గత పదేళ్లుగా డీజీపీఎస్ సర్వే పేరుతోనే పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

మచ్చుకు కొన్ని..

- మహబూబ్‌నగర్ జిల్లా శంకరాయపల్లిలో మూడు క్వారీలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. దేవరకద్ర నుంచి కోయిల్‌సాగర్ వెళ్లే దారిలోనూ ఓ గుట్టను క్వారీ అనుమతుల పేరుతో కొల్లగొట్టారు. మిడ్జిల్ మండలం లింబ్యాతండాల్లోనూ కొందరు వ్యక్తులు పోటీ పడి మైనింగ్ ద్వారా రూ.లక్షల్లో సంపాదించుకున్నట్లు ఆరోపణలున్నాయి. భూత్పూరు మండలంలో పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. బాలానగర్, మిడ్జిల్ మండలాల్లో పలుగురాళ్ల పేరుతో యథేచ్ఛగా దోపిడీ సాగుతోంది.
- జోగులాంబ గద్వాల జిల్లాలో ఇద్దరు ప్రధాన నేతలకు క్వారీలున్నాయి. ఇక్కడ నిబంధనల్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. రూ.కోట్లలో రాయల్టీని ఎగ్గొట్టేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.
- వనపర్తి జిల్లా కొత్తకోట, పెద్దమందడి, గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో క్వారీల నుంచి ఇష్టారాజ్యంగా పేలుళ్లు చేసి అక్కడే క్రషర్ యంత్రాల ద్వారా కంకరగా మార్చి విక్రయిస్తున్నారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలోని పలుగురాళ్ల పేరుతో తీసుకున్న మైనింగ్ అనుమతులు స్థానికంగా వివాదాస్పదమయ్యాయి. దీనిపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. కొల్లాపూర్, అచ్చంపేట, ఉప్పునుంతల, తాడూరులోనూ గుట్టలను నిబంధనలకు విరుద్ధంగా తవ్వి వ్యాపారం చేస్తున్నారు.
- నారాయణపేట జిల్లాలో రాయచూర్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొనే పలు చోట్ల మైనింగ్ వ్యాపారం నడుస్తోంది. ఇక్కడ పూర్తిగా నిబంధనలను పక్కకు పెట్టి వ్యాపారం చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.
- పాలమూరులో ఏ పల్లెకు వెళ్లినా మొరం కోసం యథేచ్ఛగా తవ్విన మట్టి గుట్టలే కనిపిస్తాయి. ఎలాంటి పెట్టుబడి లేకుండా రూ.లక్షల్లో సంపాదన ఉండటంతో చాలామంది గ్రామాల్లో ఉన్న మట్టిగుట్టలను తవ్వి వ్యాపారం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల పేరుతోనూ ఇష్టారాజ్యంగా మొరం మట్టి కోసం గుట్టలను మాయం చేస్తున్నారు.



మహబూబ్‌నగర్‌లోని కవాతు మైదానంలో సాధన చేస్తున్న పోలీసులు

శిక్షణకు 42 మంది ఏఎస్సైల ఎంపిక

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో 42 మంది ఏఎస్సైలు ఎస్సై శిక్షణకు ఎంపికయ్యారు. వారికి ఈ నెల 22 నుంచి 12 వారాల పాటు హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి పోలీస్ అకాడమిలో శిక్షణకు ఇస్తారు. ఇందుకు జోగులాంబ జోన్ డీఐజీ ఎస్ఎస్ చౌహాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 16 మంది, మహబూబ్‌నగర్ నుంచి 10, వనపర్తి నుంచి 09, జోగులాంబ గద్వాల నుంచి ఐదుగురు, నారాయణపేట జిల్లా నుంచి ఇద్దరు చొప్పున ఎంపికయ్యారు. 1986, 1987, 1989 కానిస్టేబుల్ బ్యాచ్‌లకు చెందిన వారిలో ప్రస్తుతం ఏఎస్సైగా పనిచేస్తున్న వారికి శిక్షణ ఇవ్వనున్నారు. వారంతా 2021లో నిర్వహించిన శాఖాపరమైన రాత పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. ఈ నెల 21న వారంతా హైదరాబాద్‌లో రిపోర్టు చేయనున్నారు. శిక్షణ తర్వాత అన్ని విభాగాల్లో ఉత్తీర్ణత సాధిస్తే వారిని ఖాళీలు ఉన్న పోలీస్ స్టేషన్లలో ఎస్సైలుగా నియమిస్తారు. ఖాళీలు లేకపోతే వారు ప్రస్తుతం పనిచేస్తున్న స్టేషన్లలోనే ఏఎస్సైలుగా కొనసాగుతారు. జోగులాంబ జోన్ పరిధిలో ఎస్సై పోస్టులు ఖాళీగా ఏర్పడితే ఆ ఏఎస్సైలకు పదోన్నతి కల్పించి నియమిస్తారు.

రిజర్వులో మరో ఐదుగురు సిద్ధం

ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో సివిల్ ఏఎస్సైలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారిలో శిక్షణకు వెళ్లడానికి ఇష్టం లేకపోయినా, అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్నా, వారి స్థానాల్లో తర్వాత సీనియారిటీ జాబితాలో ఉన్న వారికి అవకాశం కల్పిస్తారు. ఇందుకు మరో ఐదుగురి పేర్లతో జాబితా సిద్ధం చేశారు. ఎస్సై నిర్వర్తించే అన్ని రకాల విధులపై శిక్షణ పొందుతారని పోలీసు శాఖ వర్గాలు తెలిపాయి. వైద్యపరమైన పరీక్షలు చేసుకొని ధ్రువపత్రాలను తీసుకుని వెళ్లాలని వారు కోరారు.

స్థిరాస్తి వ్యాపారానికి కుంట పూడ్చివేత

గత ప్రభుత్వ పెద్దల సహకారంతో మాస్టర్ ప్లాన్‌లోనూ తొలగింపు

వెంచర్ ఏర్పాటుకు అనుమతి నిరాకరించిన జిల్లా ఉన్నతాధికారి

నిఘా

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం: మహబూబ్‌నగర్ పట్టణం నడిబొడ్డున దేవుడి పేరిట ఏర్పాటైన కాలనీ. ఉన్నత వర్గాలు నివాసముండే ఈ ప్రాంతంలో స్థిరాస్తి వ్యాపారులు ఏర్పాటు చేయాలనుకున్న వెంచర్‌కు జిల్లా ఉన్నతాధికారి అనుమతి నిరాకరించటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రూ.కోట్ల విలువైన భూమిలో వెంచర్ ఏర్పాటుకు అనుమతులు దక్కకపోవడంతో స్థిరాస్తి వ్యాపారులు రాజకీయంగా పురపాలిక యంత్రాంగంపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు పెంచుతున్నారు. వెంచర్ ఏర్పాటుకు అనుమతులు నిరాకరించిన ఉన్నతాధికారి వద్దకు ఏ దస్త్రాలతో వెళ్లి అనుమతులు వచ్చేలా చేయాలో అర్థం కాక మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారి వెంచర్ ఏర్పాటుకు ఎందుకు అనుమతులు నిరాకరించారో తెలిస్తే ఒకింత ఆశ్చర్యం కలగక మానదు.

కనుమరుగు చేశారిలా.. : కాలనీ ఏర్పాటుకు ముందు ఓ రెవెన్యూ గ్రామ పరిధి ప్రైవేటు పట్టా భూమిలో నీటి కుంట ఉండేది. ఆ గ్రామం పురపాలికలో విలీనయ్యాక అర్బన్ మండలం పరిధిలోకి వచ్చింది. కుంటను 2010 మాస్టర్ ప్లాన్‌లో గ్రీన్ జోన్‌గా నిర్ధారించగా ఆ పట్టా భూమివారు జీర్ణించుకోలేకపోయారు. వారు తమ ఆలోచనకు పదును పెట్టారు. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నేత సహకారంతో కుంటను మాస్టర్ ప్లాన్ నుంచి 2022లో తొలగింపజేయించి ఆ భూమిని స్థిరాస్తి వ్యాపారులకు విక్రయించారు. కాలనీకి ఏకైక నీటి వనరుగా ఉన్న కుంటను కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారులు ఐదు నెలల క్రితం రాత్రికి రాత్రే పొక్లెయిన్లతో పూడ్చేసి చదును చేసే ప్రయత్నం చేశారు. అప్పట్లో టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేయగా స్థిరాస్తి వ్యాపారులు మాస్టర్ ప్లాన్‌లో కుంట తీసేసిన దస్త్రాలు, గెజిట్ నోటిఫికేషన్ పత్రాలు చూపించి వెనక్కి పంపించేశారు. ఇటీవల కుంట స్థలాన్ని చదును చేసి భారీ వెంచర్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకున్న స్థిరాస్తి వ్యాపారులు టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వారా జిల్లా ఉన్నతాధికారి అనుమతి కోసం వారం క్రితం దస్త్రం పంపించారు. దస్త్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారి కుంటను పూడ్చేసి వెంచర్ ఏర్పాటు చేయడమేమిటంటూ అనుమతి నిరాకరించినట్లు సమాచారం. ఉన్నతాధికారి అనుమతి నిరాకరించడంతో అటు టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇటు స్థిరాస్తి వ్యాపారులు కంగుతిన్నారు. ఎలాగైనా జిల్లా ఉన్నతాధికారి అనుమతి పొందాలన్న పట్టుదలతో స్థిరాస్తి వ్యాపారులకు సంబంధించిన ఓ సర్వేయర్ పురపాలిక కమిషనర్‌తో తీవ్ర స్థాయిలో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారి నీటి వనరుగా ఉన్న కుంటలో స్థిరాస్తి వ్యాపారానికి అనుమతులు ఇస్తారా లేక కుంటను మాస్టర్ ప్లాన్ నుంచి ఎందుకు తొలగించారని సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా అనేది వేచి చూడాల్సిందే.

అరకొర బస్సులు.. తప్పని అవస్థలు



గద్వాల రాఘవేంద్రకాలనీ వద్ద బస్సు ఆపుతున్న విద్యార్థులు

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: బడి బస్సులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పలు మార్గాల్లో బస్సు సర్వీస్‌లు లేవు. ఉన్న రూట్లలో సమయానికి రాక ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సమయానికి బస్సులు రాకపోవడంతో పాఠశాలలకు వెళ్లలేక పోతున్నామని వాపోతున్నారు. గురువారం సాయంత్రం పాఠశాల వదిలిన తరువాత 4:30 గంటల సమయం నుంచి గద్వాల రాఘవేంద్రకాలని వద్ద దర్గా ముందు కొంత మంది విద్యార్థులు బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. 5:50 గంటలకు ఒక బస్సు వచ్చింది. అందులో నిల్చోడానికి కూడా స్థలం లేకుండా బస్టాండ్ నుంచే నిండిపోయి రావడంతో డ్రైవర్ బస్సును ఆపకుండా వెళ్ళిపోయారు. మరి కొంతసేపు ఎదురుచూసిన విద్యార్థులు చీకటి పడుతుండటంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి తమ గమ్యస్థానాలకు బయలుదేరారు. రోజూ ఇదే సమస్య ఎదుర్కొంటున్నామని, ఇళ్లకు వెళ్ళే సమయంలో అవస్థలు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



ద్విచక్రవాహనం ఆశ్రయించి ఇంటికి..



నివాళులర్పిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు

వాల్మీకి రామాయణాన్ని చదవాలి : కలెక్టర్

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: వాల్మీకి రచించిన రామాయణాన్ని అందరూ చదవాలని, పట్టుదల ఉంటే మనిషి సాధించలేనిది ఏదీ లేదనే విషయాన్ని వేల సంవత్సరాల కిందటే ఆ మహాముని సాధించారని కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం ఐడీవోసీ ఆవరణలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. చిత్రపటానికి కలెక్టర్, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేష్‌లతో పాటు, జిల్లా స్థాయి అధికారులు, వాల్మీకి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి పిలుపు



వెంకటేశ్వర్లు

ఉండవల్లి, న్యూస్‌టుడే: గద్వాల జిల్లా కేంద్రంలో ఈ నెల 25న జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు జీకే. ఈదన్న, సింగరాజు మద్దిలేటి పిలుపునిచ్చారు. గురువారం మండలకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్కిస్ట్ ఉండవల్లి మండల కార్యదర్శిగా వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకుని మాట్లాడారు. రాబోయే 3 ఏళ్ల ఉద్యమ కార్యచరణ విధానాన్ని రూపొందించుకునేందుకు జిల్లా మహాసభలు జరగనున్నాయని నాయకులు తెలిపారు. రైతాంగం, కూలీలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం నిరంతరం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వెంకట్రాముడు, చిన్న నరసింహ, సుంకన్న, శేఖర్, మధు, మల్లి, అంజి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


ధాన్యానికి బోనస్ ఎలా ఇస్తారంటే...

బోనస్... బోనస్.. వరిరైతు నోట ఈ సారి ఇదే మాట.. సన్నాలకే వర్తింపజేస్తామని అధికారులు చెబుతున్నా, అవి ఏమిటనేది రైతుల్లో సందేహం ఉంది. ఏ రకం ధాన్యానికి ఇస్తారు. ఎలాంటి నిబంధనలు ఉన్నాయో తెలుసుకుందాం.

న్యూస్‌టుడే, నారాయణపేట న్యూటౌన్

ఉమ్మడి పాలమూరు జిల్లాలో వర్షాకాలం వరి ధాన్యం సేకరణకు పౌరసరఫరాల, సహకార, ఐకేపీ, మార్కెట్ కమిటీ అధికారులు సమాయాత్తమవుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ సారి రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వింటాల్ ధాన్యానికి రూ. 5 వందలు బోనస్ చెల్లించే విధంగా చర్యలు చేపట్టింది.

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ వర్షాకాలంలో వరి సాధారణ విస్తీర్ణానికి మించి సాగైంది. సాధారణ సాగు విస్తీర్ణం 6,35,144 ఎకరాలు కాగా ఈ సారి 7,64,914 ఎకరాల్లో సాగు చేశారు. అంటే 1,29,770 ఎకరాల్లో అదనంగా సాగు అయ్యింది. మొదట్లో వర్షాలు సరిగా పడకపోవడంతో విస్తీర్ణం తగ్గవచ్చని భావించారు. ముగింపులో మంచి వర్షాలు పడటంతో వ్యవసాయ బోర్లు రీఛార్జి కావడం, కుంటలు, చెరువులు నిండటంతో పుష్కలంగా సాగయ్యింది. బోనస్ వస్తుందనే నమ్మకంతో సాగు పెంచారని భావిస్తున్నారు.





రాంకిష్టాయపల్లి శివారులో సాగు చేసిన వరి

వీటికే బోనస్

బోనస్ ఇవ్వడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సన్నాల్లోని 33 రకాలకు వర్తింపజేశారు. ధాన్యం గింజ పొడవు, వెడల్పు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? అనేది తెలుసుకోవడానికి ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద ఈ సారి మైక్రో మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. పొడవు 6 మిల్లీ మీటర్ల కంటే తక్కువ వెడల్పు రెండు మిల్లీమీటర్ల కంటే ఎక్కువ కాకుండా ఉండాలి. ధాన్యం తేమ 17 శాతానికి మించనప్పుడు మాత్రమే కొనుగోలుకు తీసుకోవాలని నిర్దేశించారు.

వర్తించే రకాలు

- సిద్ధి(డబ్ల్యుజీఎల్44)
- కంపసాగర్ వరి-1 (కేపీఎస్ 2874)
- సాంబ మసూరి (బీపీటీ 5204)
- జగిత్యాల్ వరి- 3(జేజీఎల్ 27356)
- జగిత్యాల్ వరి- 2(జేజీఎల్ 28545)
- వరంగల్ సాంబ(డబ్ల్యుజీఎల్ 14)
- వరంగల్ సన్నాలు (డబ్ల్యుజీఎల్32100)
- జగిత్యాల్ మసూరి (జేజీఎల్11470)
- పొలాస ప్రభ (జేజీఎల్ 384)
- కృష్ణ (ఆర్ఎన్ఆర్ 2458)
- మానేరు సోనా (జేజీల్ 3828)
- తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048)
- వరంగల్ వరి - 1119
- కూనరం వరి- 2 (కేఎన్ఎం 1638
- వరంగల్ వరి- 2 (డబ్ల్యుజీఎల్ 962)
- ఎంటీయూ 1271
- రాజేంద్రనగర్ వరి - 4 (ఆర్ఎన్ఆర్ 21278)
- కూనరం వరి- 1 (కేఎన్ఎం 733)
- జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798)
- జగిత్యాల సాంబ (జేజీఎల్ 3844)
- కరీంనగర్ సాంబ (.జేజీఎల్ 3855)
- అంజన (జేజీఎల్ 11118)
- నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449)
- ప్రత్యుమ్న (జేజీఎల్ 17004)
- సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465)
- శోభిని (ఆర్ఎన్ఆర్ 2354)
- సోమ్‌నాథ్ (డబ్ల్యుజీఎల్ 347)
- ఆన్ఆర్ఆర్ 31479(పీఆర్ఫ్)
- కేపీఎస్ 6251 (పీఆర్ఫ్)
- జేజీఎల్ 33124 (పీఆర్ఫ్)
- హెచ్ఎంటీ సోనా
- మార్టేరు సాంబ (ఎంటీయూ 1224)
- మార్టేరు మసూరి (ఎంటీయూ 1262)

ఫీజు బకాయిలు చెల్లించండి



ఐడీవోసీ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణవేణి చౌరస్తాలో నుంచి ఐడీవోసీ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ సంతోష్‌కు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. గత మూడు సంవత్సరాల నుంచి ఫీజులు చెల్లించకపోవడంతో నిరుపేద విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో ఆర్థిక సమస్యలు కారణంగా ప్రైవేటు కళాశాలలను నడిపించలేని స్థితిలో యజమాన్యాలు ఉన్నాయని, దీని ప్రభావం విద్యార్థులపై ప్రత్యక్షంగా చూపిస్తోందన్నారు. కళాశాలలకు బ్యాంకులో ఎన్‌పీఏ ఖాతాలు ఉండటంతో ప్రభుత్వం కళాశాలలకు ఫీజులు చెల్లించకపోవడం వల్ల బ్లాక్ లిస్టులోకి వెళుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బకాయి పడిన ఫీజులను మంజూరు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. విద్యార్థి సంఘాల నాయకులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తుంగభద్రలో 28,380 క్యూసెక్కుల ప్రవాహం

శాంతినగర్, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో 28,380 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట 10.1 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.1 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, అది రాష్ట్రానికి వచ్చేసరికి 5.3 అడుగులుగా ఉంది.



నువ్వులు విరిశాయి!



విరబూసిన పూలతో నువ్వుల పంట కనువిందు చేస్తోంది. భూత్పూర్ మండలం గోప్లాపూర్ శివారులో ఓ రైతు నువ్వుల పంట సాగుచేశారు. ప్రస్తుతం ఆ పంట పూత దశలో ఉంది. లేత గులాబీ వర్ణంలో విరిసిన పూలతో అక్కడేదో పూలతోట ఉన్నట్లుగా కనిపిస్తోంది. పూలలోని మకరందాన్ని గ్రోలుతూ తేనెటీగలు సందడి చేస్తున్నాయి. చూపరులను ఆకట్టుకుంటున్న ఆ దృశ్యాలను 'ఈనాడు' క్లిక్ మనిపించింది. - ఈనాడు, మహబూబ్‌నగర్

బడికెళ్లాలంటే ఎన్ని కష్టాలో!



శాంతినగర్ ఉన్నత పాఠశాలకు వడ్డేపల్లి మండలం కోయిదిన్నె నుంచి 6 కి.మీ. ప్రయాణించి 20 మంది, మానవపాడు మండలం మద్దూరు నుంచి 12 కి.మీ ప్రయాణించి 40 మందికి పైగా విద్యార్థులు వస్తున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో వీరంతా ప్రైవేటు వాహనాలు, సైకిళ్లపై వస్తున్నారు. ఇలా ప్రతి నెలా వీరు రూ.600 - 900 వరకు రవాణా కోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది.

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్, అయిజ

రవాణా భత్యమూ చెల్లించని ప్రభుత్వం | గ్రామాలకు నిలిచిన ఆర్టీసీ బస్సులు

బడికెళ్లడానికి విద్యార్థులు నానా కష్టాలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో వందలాది గ్రామాల విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ఇబ్బందులు పడుతూ ప్రమాదకర ప్రయాణాలు చేస్తూ పాఠశాలలకు చేరుకుంటున్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం గతంలో రవాణా భత్యం అందించేది. ప్రస్తుతం విద్యాశాఖ ప్రతిపాదనలు పంపుతున్నా.. నిధులు విడుదల కాకపోవడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోంది. కొన్ని గ్రామాల్లో తల్లిదండ్రులు ఏకంగా పిల్లలను బడి మాన్పించేస్తున్న పరిస్థితి ఉంది.

ఐదు వేలకుపైగా: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో 3.20 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో దాదాపు నాలుగు వందలకుపైగా పాఠశాలలు విద్యార్థులకు దూరంగా ఉంటున్నాయి. దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం చెల్లించాల్సి ఉంది. ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కిలోమీటరు దూరం వెళ్తుంటే.. 1 - 5వ తరగతి వారికి నెలకు రూ.400 చొప్పున, 3 కి.మీ. దూరం నుంచి వస్తున్న 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.600 చొప్పున చెల్లించేవారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేల మందికి ఈ భత్యం చెల్లించాల్సి ఉంది. ఏటా విద్యాశాఖ ప్రతిపాదనలు పంపుతున్నా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు.

ఇవిగో కొన్ని..

- వనపర్తి జిల్లా అమరచింత ఉన్నత పాఠశాలకు 6 కిలోమీటర్ల దూరంలో ధర్మాపురం నుంచి 10 మందికిపైగా విద్యార్థులు వస్తుంటారు. మూడు కి.మీ. దూరంలోని చంద్రానాయక్‌తాండా నుంచి 20 మందికి పైగా వస్తుంటారు. ఈ రెండు గ్రామాలకు బస్సు లేదు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి రావాల్సిందే. ఆరు కి.మీ. దూరంలోని కొంకలవానిపల్లె నుంచి 30 మందికిపైగా విద్యార్థులు వస్తుంటారు.
- రాజోలి మండలం తుమ్మిళ్ల గ్రామం నుంచి 5 కి.మీ. దూరంలోని పెద్దతాండ్రపాడుకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేదు. ఆడపిల్లలను సైకిళ్లపై పంపలేక పది మందికి పైగా బాలికలను వారి తల్లిదండ్రులు బడి మాన్పించారు.
- గద్వాల జిల్లా రాజోలి, అయిజ, వడ్డేపల్లి, ఉండవల్లి, మల్దకల్ మండలాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. సైకిళ్లపై వస్తూ కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ.. ప్రతి రోజూ రూ.30 - రూ.50 పైగా ఖర్చు చేస్తున్నారు.



ఊట్కూరు: కాలినడకన మక్తల్ ఉన్నత పాఠశాలకు నడచివెళుతున్న ఊట్కూరు మండలం పెద్దపొర్ల విద్యార్థులు వీరు. సుమారు నాలుగు కిలోమీటర్లు నడిచి స్టేజీ వరకువెళ్లి అక్కడ నుంచి 12 కి.మీ. దూరంలోని మక్తల్‌కు బస్సులో చేరుకుంటారు. రోజూ సుమారు 50 మంది విద్యార్థులు ఇలా వెళుతుంటారు. గ్రామానికి తారురోడ్డున్నా బస్సు సౌకర్యం మాత్రం లేదు.

రవాణా భత్యం అందించాలి



నేను, నాతో పాటు మరో 30 మంది కలిసి మా గ్రామం నుంచి చదువుకోవడానికి 12 కి.మీ. దూరంలోని శాంతినగర్ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నాం. బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నాం. మా లాంటి వారి కోసం ప్రభుత్వం రవాణా భత్యం ఇస్తానని సార్లు చెప్పారు. ఇప్పటి వరకు ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలి. -ఆనంద్, 8వ తరగతి, తుమ్మిళ్ల

ఉన్నతాధికారులకు తెలిపాం

విద్యార్థులకు రవాణా భత్యం అందించడానికి ఏటా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులు నివేదిస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. అయితే, గతేడాది కొందరు విద్యార్థుల ఖాతాల్లో ఒక ఏడాది డబ్బులు పడినట్లుగా చెప్పారు. మాకు మాత్రం అధికారికంగా రాలేదు. మరోసారి సమస్యను ఉన్నతాధికారులకు విన్నవిస్తాం.
-శాంతిరాజు, జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి, గద్వాల



జడ్చర్ల న్యూటౌన్: మిడ్జిల్ మండలం వస్పుల ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు వీరు. వల్లభరావుపల్లి, లింబ్యాతండా, దోనూరు, కొంపెసెల్లి తదితర గ్రామాల నుంచి సుమారు 40 మంది విద్యార్థులు నిత్యం నాలుగు కిలోమీటర్ల దూరం ఇలా నడిచి, లేదా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి రావాల్సిందే.

అండర్-14 క్రికెట్ విజేత మహబూబ్‌నగర్

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: గద్వాల ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన అండర్-14 బాలుర రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. రాష్ట్రం నుంచి పది జిల్లాల జట్లు హాజరు కాగా, మహబూబ్‌నగర్ ప్రథమ, రంగారెడ్డి, హైదరాబాద్ సంయుక్తంగా ద్వితీయ, నల్గొండ తృతీయ స్థానాలు దక్కించుకున్నాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్ తెలిపారు. అనంతరం విజేతలకు జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ ట్రోఫీ అందజేశారు. ఈ క్రమంలో పతకాలను, ప్రశంసా పత్రాలను ఆయన చేతులమీదుగా బహూకరించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని కన్వీనర్ శ్రీనివాసులు తెలియజేశారు. జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్, సూపరింటెండెంట్ రామకృష్ణారావు, విజయ్‌పాల్, కృష్ణయ్య, బీసన్న పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్

19న బిజినేపల్లిలో ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లను ఈనెల 19న బిజినేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర) మైదానంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఖోఖో సంఘం కార్యదర్శి విలియం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్, బోనఫైడ్‌తో ఉదయం 9 గంటలకు మైదానంలో నివేదించాలని కోరారు. వివరాలకు 95531 24166, 94934 50450 నంబర్లలో సంప్రదించాలన్నారు. రాష్ట్రస్థాయి ఖోఖో జూనియర్స్ టోర్నీ త్వరలో మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలోకి నేడు సీఎం కప్ క్రీడాజ్యోతి పరుగు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా టోర్నీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా ఈ నెల 3న ఎల్బీ స్టేడియంలో 10 కి.మీ.ల సీఎం కప్ క్రీడాజ్యోతి పరుగు పందెం నిర్వహించింది. ఇదే రోజు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో సీఎం కప్ క్రీడాజ్యోతి వాహన ర్యాలీని ప్రారంభించారు. ఇది రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాల మీదుగా ఈనెల 21 వరకు 33 జిల్లాల్లో 2,830 కి.మీ.ల సాగుతుంది. ఈ వాహన ర్యాలీ ఈనెల 18న ఉమ్మడి జిల్లాలో ప్రవేశిస్తుంది. అయిదు జిల్లాల్లో ఈ నెల 20 వరకు కొనసాగుతుంది. జిల్లాల యువజన క్రీడల అధికారులు, క్రీడా సంఘాలు క్రీడాజ్యోతి వాహన ర్యాలీని జయప్రదం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.



జిల్లాల వారీగా 10కే రన్ : ఈ నెల 18న ఉదయం నాగర్‌కర్నూల్‌లోని కొత్త కలెక్టరేట్ నుంచి లిటిల్ ఫ్లవర్ పాఠశాల వరకు 10 కి.మీ.ల పరుగు పందెం కొనసాగనుంది. ఇదే రోజు సాయంత్రం వనపర్తి జిల్లాలోని చిట్యాల నుంచి కలెక్టరేట్ వరకు పరుగు నిర్వహిస్తారు. ఈనెల 19న ఉదయం జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు సంగాల పార్కు నుంచి గద్వాలలోని కలెక్టరేట్ వరకు, ఇదే రోజు సాయంత్రం నారాయణపేట జిల్లాలో తిప్రాస్‌పల్లి నుంచి పట్టణంలోని నర్సిరెడ్డి చౌరస్తా వరకు పరుగు కొనసాగుతుంది. ఈ నెల 20న మహబూబ్‌నగర్‌లో క్రీడాజ్యోతి పరుగు డీఎస్‌ఏ మైదానం నుంచి మెట్టుగడ్డ వరకు నిర్వహిస్తారు. యువజన, క్రీడల శాఖ సిబ్బంది, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు పాల్గొంటారు.

ఉమ్మడి జిల్లాలో 370 కి.మీ.లు

నల్గొండ నుంచి వచ్చే వాహన ర్యాలీ ఈనెల 18న చారకొండలో ప్రవేశిస్తుంది. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొడంగల్, సవాయిగూడెం, పెబ్బేరు, ఎర్రవల్లి, జమ్మిచేడు మీదుగా చిట్యాలకు చేరుతుంది. 19న వనపర్తి కలెక్టరేట్, ఆత్మకూరు, జక్లేర్ ధన్వాడ, జాజాపూర్, మరికల్, బండ్రవల్లి, తిప్రాస్‌పల్లిలో, 20న నారాయణపేట, దేవరకద్ర, ధర్మాపూర్, హన్వాడ, పరిగి, కడ్తాల్, మహేశ్వరం, పెద్దఅంబర్‌పేట, తిమ్మాయిపల్లి మీదుగా మంకాల్‌కు చేరుకుంటుంది. ఉమ్మడి జిల్లాలో 370 కి.మీ.లు ర్యాలీ సాగుతుందని డీవైఎస్‌వో శ్రీనివాస్ చెప్పారు.

కురుమూర్తి జాతరకు పక్కా ఏర్పాట్లు: కలెక్టర్

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకురుమూర్తి స్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధికారులకు సూచించారు. కురుమూర్తి స్వామి జాతర మైదానంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీలకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 31 నుంచి నవంబరు 18 వరకు స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉద్దాల రోజున 3 లక్షల మంది భక్తులొచ్చే అవకాశం ఉందని భక్తులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు సరిపడా బస్సులు అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. రహదారులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. జాతర మైదానంలో పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కోనేరులో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలు భక్తులకు సేవలందేలా చూడాలన్నారు. 24 గంటలూ విద్యుత్తు, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు గ్రామపంచాయతీలు, పురపాలికల నుంచి సిబ్బందిని కేటాయించాలన్నారు. 108 వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. పార్కింగ్, బారికేడింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. జాతరలో మద్యం విక్రయాలు జరగకుండా ఆబ్కారీ అధికారులు చూడాలన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు, మహిళలకు షీటీంలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఆలయ ఛైర్మన్ గోవర్ధన్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పద్మ, ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి, డీపీవో పార్థసారథి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ

రేషన్ బియ్యం పట్టివేత

మానవపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలో 23 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయని ఎస్సై చంద్రకాంత్ తెలిపారు. మండలంలోని జల్లాపురం గ్రామానికి చెందిన ఎరుకలి రవి నుంచి 16 క్వింటాళ్లు, పెద్దపోతులపాడు గ్రామంలో కాసీం నుంచి 7 క్వింటాళ్ల బియ్యాన్ని వనపర్తి జిల్లాలోని పెబ్బేరుకు చెందిన విజయ్, కృష్ణయ్య, ఇటిక్యాల మండలంలోని కొండేరుకు చెందిన వెంకటరాముడు, శివ కొనుగోలు చేసి అశోక్ లే ల్యాండ్ ఆటోలో పెబ్బేరుకు తరలిస్తున్నారు. అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించి బియ్యంతో పాటు ఆటోను స్వాధీనం చేసుకొని ఠాణాకు తరలించామన్నారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు పైఆరు మందితో పాటు ఆటో డ్రైవర్ సురేందర్‌పైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బోయపల్లి యువకుడి సైకిల్‌యాత్ర



మహబూబ్‌నగర్ సాంస్కృతికం, మహమ్మదాబాద్ : సనాతన ధర్మ పరిరక్షణ ఆవశ్యకత వివరించేందుకు మహబూబ్‌నగర్ పట్టణ సమీపం బోయపల్లికి చెందిన యువకుడు మల్లేశ్‌గౌడ్ సైకిల్‌యాత్రకు శ్రీకారం చుట్టారు. గురువారం బోయపల్లి గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో పూజల తర్వాత యాత్ర ప్రారంభించారు. మల్లేశ్ గౌడ్ మాట్లాడుతూ సనాతన ధర్మ ఔన్నత్యం, దాని పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ రోజూ 100 కి.మీ.లు సైకిల్‌యాత్ర చేసి స్థానిక ఆలయాల్లో బస చేస్తానని తెలిపారు. ఏడాది పాటు కొనసాగే ఈ యాత్రలో భాగంగా దేశంలోని 12 జ్యోతిర్లింగాలను దర్శించుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్‌ను అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్, స్థానిక వివిధ యువజన సంఘాలు, ఆలయ కమిటీల ప్రతినిధులు సన్మానించారు. మహమ్మదాబాద్ శివారులో హిందూ వాహిని సభ్యులు శ్రీనివాస్, రఘు, రాకేశ్ తదితరులు స్వాగతం పలికి సన్మానించారు.

కనుల పండువగా కల్యాణం



మంగళసూత్రాలు చూపిస్తున్న పురోహితులు

మల్దకల్, న్యూస్‌టుడే: ఆశ్వయుజమాసం గురువారం పౌర్ణమి సందర్భంగా మల్దకల్ ఆదిశిలాక్షేత్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదిశిలావాసుడి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, గోపూజ, పవమాన హోమం, పంచామృతాభిషేకం, పుష్పార్చన, అలంకరణ, మహామంగళహారతి నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం, పల్లకీసేవ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ఊంజలసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో సత్యచంద్రారెడ్డి, ఛైర్మన్ ప్రహ్లాదరావు, అశోక్‌కుమార్, ముకుందరావు, చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలను కల్యాణానికి తెస్తున్న పూజారులు

ఇంటి నుంచి బయటకెళ్లి.. చెరువులో శవమై..




కిశోర్‌కుమార్

దిల్‌సుఖ్‌నగర్, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని యువకుడు సరూర్‌నగర్ చెరువులో శవమై కనిపించిన ఘటన సరూర్‌నగర్ ఠాణా పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన కాట్రమోని కిశోర్‌కుమార్ (34) తల్లిదండ్రులు, సోదరులతో కలిసి కొంత కాలంగా నగరంలోని నందనవనంలో నివసిస్తున్నారు. కూలీ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అయితే కొంతకాలంగా మతిస్థిమితం లేకపోవడంతో కూలీ పనులు మానేశాడు. ఈ నెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి.. తిరిగిరాలేదు. గురువారం చెరువులో మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో నుంచి పడి యువకుడి మృతి

చేవెళ్ల గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్- బీజాపూర్ రహదారిపై ఆటోలో నుంచి పడి ఒకరు మృతిచెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మర్కల్ గ్రామానికి చెందిన పుట్ట శంకర్(19) హైదరాబాద్‌లోని చేపల వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. నగరం చుట్టూ జరిగే సంతల్లో చేపలను విక్రయించడానికి నిత్యం ఆటోలో వెళ్లేవాడు. ఈ క్రమంలోనే చేవెళ్ల మార్కెట్లో చేపలు అమ్మేందుకు మరో ముగ్గురితో కలిసి బయల్దేరాడు. కేసారం గేటు సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి ఒకవైపు ఒరగడంతో అందులో నుంచి శంకర్, రాములు రోడ్డుపై పడిపోయారు. శంకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి బలవన్మరణం



వీరశేఖర్ (పాత చిత్రం)

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: మనోవేదనతో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. గద్వాల పుర పరిధిలోని నల్లకుంటకు చెందిన వీరశేఖర్ (50) ఎర్రవల్లి మండలం కోదండాపురం జడ్పీహెచ్‌ఎస్‌లో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కొద్ది రోజులుగా మనోవేదనతో బాధపడుతున్న అతడు తన బాధను కుటుంబ సభ్యులకు వివరించారు. ఆయనకు ధైర్యం చెప్పారు. అయినప్పటికీ గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటికెళ్లిన ఆయన గద్వాల రైల్వే స్టేషన్ సమీపంలోని రెండో రైల్వే గేటు(ఆర్వోబీ) వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరశేఖర్‌కు భార్య మంజులాబాయి(తెలుగు పండిత్), కుమార్తెలు విజ్ఞత (18), వినూత్న(15) ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.


కుటుంబ సభ్యుల చెంతకు చేరిన యువకుడు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : రెండేళ్ల కిందట అదృశ్యమైన ఓ యువకుడు సామాజిక మాధ్యమం ద్వారా కుటుంబసభ్యుల చెంతకు చేరారు. వనపర్తి జిల్లా కొత్తకోట ఎస్సై మంజునాథరెడ్డి కథనం ప్రకారం.. శంషాబాద్‌కు చెందిన రాములుకు కుమారుడు చరణ్ (20), ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడికి చిన్నప్పటి నుంచి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి వద్దే ఉండేవారు. రెండేళ్ల క్రితం రాములు ఇల్లు కూలిపోయింది. సమీపంలో ఉన్న బంధువుల ఇంటికి సామగ్రి తరలించే క్రమంలో కుమారుడు కనిపించకుండా పోయారు. అతని కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చరణ్ ఎక్కడెక్కడో తిరుగుతూ వారం క్రితం కొత్తకోటకు చేరారు. ఇక్కడ ఉన్న యువకులు విష్ణువర్ధన్, రఘు, శ్రీకాంత్‌తో అతను చనువుగా ఉండటంతో పాటు ఇన్‌స్టాగ్రామ్‌ను చూస్తూ పాటలకు నృత్యాలు చేసేవారు. అతని పేరిట వారు ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరచి అతను చేసిన నృత్యాల వీడియోలు పోస్టు చేశారు. వాటిని 14 లక్షలకు పైగా మంది వీక్షించారు. రాములు కుటుంబసభ్యులు చూసి కొత్తకోట యువకులకు ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. వీడియో కాల్ చేయడంతో చరణ్ తన తండ్రి, అక్కలను గుర్తు పట్టారు. గురువారం కొత్తకోట పోలీసు స్టేషన్‌కు చేరుకున్న రాములుకు చరణ్‌ను అప్పగించామని ఎస్సై తెలిపారు. యువకుడిని కన్నవారి చెంతకు చేర్చిన యువకులను ఆయన అభినందించారు.



కుటుంబ సభ్యులకు చరణ్ (కుడినుంచి మూడో వ్యక్తి)ను అప్పగిస్తున్న ఎస్సై మంజునాథరెడ్డి, యువకులు

చికెన్ ధరలు



ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

తెరపై ఈనాడు

గద్వాల : ఎస్వీఎస్ సినిమాస్... దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక, అయిజ : శివసాయి : దేవర, భువనేశ్వర్ : విశ్వం, మాధవ్ : వేట్టయన్

- న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

ఫీజు బకాయిలు చెల్లించాలని వినతి

అయిజ, ఉండవల్లి, న్యూస్‌టుడే: మూడేళ్లుగా డిగ్రీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అయిజలోని గాయత్రి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బస్వరాజు పేర్కొన్నారు. గురువారం కళాశాల అధ్యాపకులు స్థానిక తెలంగాణ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వం వెంటనే నిధులను మంజూరు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ● రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించాలని డిగ్రీ కళాశాలల యాజమాన్యం ఉండవల్లి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఫీజు బకాయిలు చెల్లించే వరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలలు నిరవధికంగా బంద్ చేస్తున్నామని విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని వారు కోరారు. అలంపూర్‌చౌరస్తా విశ్వశాంతి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

లక్ష్యంతో చదివితే విజయం సొంతం

రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్



ప్రసంగిస్తున్న తఫ్సీర్ ఇక్బాల్, వేదికపై ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికి అనుగుణంగా కష్టపడితే తప్పక విజయం వరిస్తుందని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో మిల్లీ మహాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల భారత విద్యా సదస్సులో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. విద్యార్థులు తమలోని బలహీనతలను బేరీజు వేసుకుని వాటిని అధిగమిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల కోసం 200 గురుకులాలు నిర్వహిస్తోందని, ఇందులో లక్ష మంది చదువుతున్నారని తెలిపారు. మైనార్టీ గురుకులాలకు చెందిన 31 మంది విద్యార్థులు నీట్‌లో సత్తా చాటి ఎంబీబీఎస్ అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, పిల్లలను చదువులో ప్రోత్సహించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో అడ్వాన్స్ శిక్షణ కేంద్రానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అలీఫ్ ఫౌండేషన్ డైరెక్టర్ సమీర్ అహ్మద్ సిద్ధిఖీ, మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, విద్యావేత్తలు ఇర్ఫాన్ కరీం, లతీఫ్, జహీరుద్దీన్, మిల్లీ మహాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడాజ్యోతి ర్యాలీకి హాజరుకండి

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: గద్వాల జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ శనివారం ఉదయం 6 గంటలకు సంగాల పార్క్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పీడీ, పీఈటీలు, ప్రజా ప్రతినిధులు, పదో పటాలం పోలీసులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో హాజరుకాగలరని కోరారు.

చట్టాలపై బాలికలకు అవగాహన అవసరం


ఆల్వాల్‌పాడు పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న సురేశ్

ధరూరు, శాంతినగర్, న్యూస్‌టుడే: బాలికల రక్షణకు ప్రభుత్వం, న్యాయవ్యవస్థ ద్వారా అమలు చేస్తున్న చట్టాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం బాలికలపై ఉందని శిశు సంక్షేమ శాఖ సమన్వయకర్త సురేశ్ అన్నారు. గురువారం ఆల్వాల్‌పాడు గ్రామంలో పాఠశాలలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో బాలికలు వ్యవహరించాల్సి తీరు, అందే రక్షణ సాయం తదితరాలపై వివరించారు. ● శాంతినగర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలల హక్కులపైన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్ప అవగాహన కల్పించారు. 24 గంటలు బాలల సంరక్షణకు 1098 అందుబాటులో ఉందన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ప్రిన్సిపల్ రమ ఓబులేషు, శివలీల, లక్ష్మీదేవమ్మ, నవీన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పట్టుతప్పితే.. ప్రమాదమే



ద్విచక్రవాహనంపై ముగ్గురు వెళ్లడమే ప్రమాదంతో కూడుకున్న పని. అలాంటిది ఐదుగురు పిల్లలను వాహనంపై కూర్చోబెట్టుకుని ప్రమాదకరంగా ప్రయాణిస్తూ కన్పించాడు. ఏ మాత్రం పట్టుతప్పినా అందరూ ప్రమాదంలో పడినట్లే.. గద్వాల పట్టణం రాఘవేంద్రకాలనీ వద్ద రాయచూర్‌కి వెళ్ళే మార్గంలో 'న్యూస్‌టుడే'కు చిక్కిన చిత్రమిది. - న్యూస్‌టుడే, గద్వాల పట్టణం

ఈ నిర్మాణం ఎందుకోసమో!


పగలు నిర్మాణం ఇలా

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: పట్టణ ప్రధాన రహదారుల పక్కన, రోడ్డు డివైడర్లలో, ప్రధాన చౌరస్తాలలో ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా అనుమతులు తీసుకోవాలి. విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి అన్ని జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన ఓ కమిటీ ఉంటుంది. ఆ కమిటీ అనుమతుల మేరకు విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా కృష్ణవేణి చౌరస్తా సమీపంలో గద్వాల- కర్నూల్ ప్రధాన రోడ్డు డివైడర్ మధ్యలో విగ్రహం ఏర్పాటు చేసేందుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పట్టణ అధికారులు: విగ్రహం ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఇచ్చారా? లేదా? అనే విషయంపై ఏ స్థాయిలోనూ స్పందన లేదు. రెండు రోజులుగా నిర్మాణ పనులు జరుగుతున్నా పురపాలక శాఖ అధికారులు అటువైపు చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విగ్రహం ఏర్పాటు అనేక ప్రశ్నలకు తావిస్తోంది. అసలు ఈ స్థలంలో విగ్రహాన్ని ఎవరు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన విగ్రహం ఎవరిది? అనుమతులు ఉన్నాయా? రోడ్డు డివైడర్ మధ్యలో విగ్రహం ఏర్పాటుకు పనులు జరుగుతున్న సమయంలో పుర పాలకసంఘం అధికారులు ఏం చేస్తున్నారని పట్టణ ప్రజలు అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు.

రోడ్డు మధ్యలో చేపడుతున్నా పట్టని వైనం

నేడు ఆవిష్కరించాలని..: మహనీయుల విగ్రహాల ఏర్పాటు తప్పు కానప్పటికీ నిబంధన ప్రకారం ఏర్పాటు చేయాలని అంటున్నారు. రాజకీయ నాయకులు మెప్పు కోసం హడావుడిగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎందుకు ఏర్పడిందని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే సదరు నిర్వాహకులు కలెక్టరేట్ ఎదురుగా విగ్రహం ఏర్పాటు చేశారని, రెండోది ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ఉదయం ఇటుకతో దిమ్మె, మెట్లు నిర్మించారు. సాయంత్రం నాటికి నిర్మాణం పూర్తి చేసి కప్పి ఉంచారు. అర్ధరాత్రి విగ్రహం ఏర్పాటు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం గద్వాలలో రాష్ట్ర మంత్రుల పర్యటనలు ఉండటంతో వారితో ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించాలని నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. డివైడర్‌లో చేపడుతున్న నిర్మాణంపై పుర కమిషనర్ దశరథ్‌ను వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


రాత్రి కప్పి ఉంచిన దృశ్యం

పాఠశాల తనిఖీ చేసిన డీఈవో

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: గద్వాల పురపరిధిలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వంటగది, మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించి వాటిని త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పాఠశాలలోని స్టోర్ రూమ్‌ను, రికార్డులను తనిఖీ చేశారు.

ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

ఉండవల్లి, ధరూరు, న్యూస్‌టుడే: మండలంలోని బొంకూరు, ఉండవల్లి, మారమునగాల గ్రామాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పశుసంవర్ధక శాఖ అధికారులు గురువారం వేశారు. పశువైద్య జిల్లా అధికారి డా.వెంకటేశ్వర్లు బొంకూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 3 నెలలు పైబడిన ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకా వేయించి వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవాలని పాడి రైతులకు సూచించారు. ● పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు విధిగా వేయించాలని కేటిదొడ్డి మండల పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్ సూచించారు. గురువారం గువ్వలదిన్నె గ్రామంలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

వర్షం పడితే ముంపే

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: వర్షం పడితే చాలు పట్టణ ప్రజలు భయపడాల్సిన పరిస్థితి. వర్షం నీటికి తోడు కాలువల్లోని మురుగు రోడెక్కుతుండటంతో పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. గద్వాల పురపాలికలో పలుచోట్ల ఇదే పరిస్థితి ఎదురవుతోంది. గురువారం కురిసిన వర్షానికి మోమిన్‌మహల్లా కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక వరద నీరు రోడ్డెక్కి ఇళ్ల వద్దకు చేరింది. రాఘవేంద్రకాలనీ, అంబేద్కర్‌చౌక్, రాజీవ్‌మార్గ్, కృష్ణవేణిచౌక్, పెద్దాసుపత్రి మార్గంలో ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలిచి చిన్నపాటి చెరువును తలపించింది. వర్షం కారణంగా ఆర్టీసీ ప్రాంగణంలో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. బస్టాండ్‌కు ముక్కు మూసుకుని వెళ్ళాల్సిన దుస్థితి నెలకొంటోంది.


రాఘవేంద్రకాలనీ వద్ద రహదారిపై నిలిచిన వర్షపు నీరు


రాజీవ్‌మార్గ్‌లో ఇదే పరిస్థితి..


అంబేద్కర్‌చౌక్‌లో..


ఆర్టీసీ ప్రాంగణంలో అధ్వానంగా పరిసరాలు

సమాజంలో విలువలు పెంచేవి గ్రంథాలయాలు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : సాంకేతికత పెరిగిన నేపథ్యంలో సమాజంలో విలువలు, సంస్కృతిని, ధైర్యాన్ని పెంచేవి గ్రంథాలయాలేనని ప్రొహిబిషన్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో వనపర్తి గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా గోవర్ధన్‌సాగర్ ప్రమాణస్వీకార కార్యక్రమం ఎమ్మెల్యే మేఘారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. నాణ్యత, విలువలతో కూడిన విద్య లేక విద్యార్థులు చిన్న చిన్న విషయాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. జిల్లాలోని ప్రతి మండలంలో గ్రంథాలయాలను పండగ వాతావరణంలో ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అందుకు కావాల్సిన నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. నల్లచెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు బోటు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా వెంటనే మంజూరు చేశారన్నారు. అనంతరం సంస్థ ఛైర్మన్‌గా గోవర్ధన్ సాగర్‌ను గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ ప్రమాణస్వీకారం చేయించారు.


మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్

అనంతరం మంత్రి, వనపర్తి ఎమ్మెల్యేతో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, పలువురునాయకులు, కార్యకర్తలు గోవర్ధన్‌సాగర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, గ్రంథాలయ కార్యదర్శి మనోజ్, డీసీసీబీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పురపాలిక ఉపాధ్యక్షుడు పాకనాటి కృష్ణయ్య, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భారాస పాలనలో రాష్ట్రం అప్పులపాలు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: భారాస నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం ఆయన వనపర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డితో కలిసి వనపర్తిలో విలేకరులతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం చేసిన అప్పులకు తమ ప్రభుత్వం రూ.లక్షల కోట్ల వడ్డీ చెల్లిస్తూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్నామన్నారు. దీపావళి నాటికి రూ.2 లక్షలు రుణమాఫీ పూర్తి చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో ఆక్రమణలు భారాస పుణ్యమేనని విమర్శించారు. వనపర్తి జిల్లాలో ప్రభుత్వ స్థలాలను ఆపార్టీ మహానుభావులు కబ్జా చేశారన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి విషయంలో రాజీవ్‌చౌక్‌లో చర్చకు సిద్ధమా అని భారాస నాయకులకు సవాల్ విసిరారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అలీబాబా అరడజను దొంగల మాదిరిగా భారాస నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దోచుకున్నారని ఆరోపించారు.

ఘనంగా ధన్వంతరి కల్యాణం


స్వామివారి రథాన్ని లాగుతున్న దంపతులు

అయిజ, న్యూస్‌టుడే: అయిజ మండలం ఉత్తనూరులోని ధన్వంతరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం విగ్రహానికి అభిషేకం, వస్త్రాలంకరణ, నైవేద్యం, ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం హోమం పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి, వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. సాయంత్రం పల్లకిసేవ, రథోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి రథాన్ని ఆలయం నుంచి గ్రామ చావిడివరకు లాగి తిరిగి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అనంతరం పూజాకార్యక్రమాలను ముగించారు.

కనుల పండువగా శ్రీనివాసుడి..


అలమేలు మంగ సమేతంగా దర్శనమిస్తున్న శ్రీనివాసుడు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : పౌర్ణమి సందర్భంగా గురువారం మన్యంకొండలో శ్రీవేంకటేశ్వర స్వామి, అలమేలు మంగ కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలోని హనుమద్దాసుల మండపంలో ప్రత్యేక పూజల అనంతరం మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య ధర్మకర్త అలహరి మధుసూదన్‌కుమార్ స్వామివారి కల్యాణ క్రతువు నిర్వహించారు. అనంతరం శ్రీనివాస సమేత అలమేలుమంగను శేషవాహనంపై ఊరేగించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం గర్భాలయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మానవాళికి మార్గదర్శి భగవద్గీత

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : భగవద్గీత మానవాళికి మార్గదర్శనం చేస్తుందని, పిల్లలు చిన్నప్పుడే గీత చదివేతే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తితిదే ఉమ్మడి జిల్లా బాధ్యుడు డా.ఉత్తరపల్లి రామాచారి అన్నారు. తితిదే, హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో 'మానవులందరికీ భగవద్గీత' పేరుతో ముద్రించిన పుస్తకాన్ని గురువారం మహబూబ్‌నగర్‌లోని తితిదే కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామాచారి భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. డా.విభీషణ శర్మ ప్రత్యేకంగా విద్యార్థుల కోసం శ్లోకం, భావంతో కూడిన వచనా పుస్తకాన్ని వెలువరించారని, వాటిని పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. పుస్తకాలు కావాల్సిన ప్రధానోపాధ్యాయులు తితిదే కల్యాణ మండపంలో శుక్ర, శని వారాల్లో సంప్రదించాలని రామాచారి సూచించారు. ధార్మిక కమిటీ సభ్యులు కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భగవద్గీత ప్రతి హిందూ కుటుంబం వద్ద తప్పకుండా ఉండాల్సిన పవిత్రమైన గ్రంథమన్నారు. ధర్మాచార్యులు ఎం.రజనీ సంక్షిప్త భగవద్గీత పుస్తకాన్ని సమీక్ష చేశారు.

సీతాఫలాల కేంద్రం సందర్శించిన ఉద్యాన వర్సిటీ వీసీ

నవాబ్‌పేట, న్యూస్‌టుడే : నవాబ్‌పేట మండలం పోమాల్ గ్రామంలో పాలమూరు రైతు డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీతాఫల ప్రాసెసింగ్ కేంద్రాన్ని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ నీరజ ప్రభాకర్ గురువారం సందర్శించారు.

ప్రయాణికుడి మృతి

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : ఓ ప్రయాణికుడు కొత్తకోటలో ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. ప్రయాణికుల కథనం ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ఉప్పేరుకు చెందిన కోటన్న (50) హైదరాబాద్‌లో బస్సెక్కారు. కొత్తకోట వద్దకు రాగానే ఆయనకు వాంతులు, విరేచనాలు కావడంతో బస్సు నుంచి కిందకు దిగారు. వెంటనే అక్కడే కుప్పకూలిపోయారు. ప్రయాణికులు 108 అంబులెన్స్ వారికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరీక్షించారు. అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. కోటన్న వద్ద ఉన్న చరవాణితో బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

ధరూరు చెరువులో మృతదేహం

ధరూరు, న్యూస్‌టుడే: సమీపంలోని పెద్దచెరువులో గురువారం మృతదేహం లభ్యమైంది. గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్మకూరుకు చెందిన చాకలి వెంకటేశ్ ధరూరులో ఓ ఇంట్లో గత కొంత కాలంగా పనిమనిషిగా ఉంటున్నాడు. రెండు రోజుల కిందట బహిర్భూమికని చెరువు వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు చెరువు సమీపంలో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం మృతదేహం లభ్యమైంది. ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులంటున్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకట్రాములు తెలిపారు.

దుర్భాషలాడినందుకు కేసు

ధరూరు, న్యూస్‌టుడే: నర్సన్‌దొడ్డి చౌరస్తా వద్ద గద్వాల ఆత్మకూరు బస్సులో ఆర్టీసీ డ్రైవర్‌పై దుర్భాషలాడినందుకు వ్యక్తిపై కేసు నమోదయ్యింది. ఎస్సై అబ్దుల్ షుకూరు కథనం మేరకు... సయ్యద్ వసీం అనే వ్యక్తి బస్సులో ప్రయాణిస్తూ డ్రైవర్ చిన్నారెడ్డితో వాగ్వాదానికి దిగటంతో పాటు దుర్భాషలాడటంతో చిన్నారెడ్డి ధరూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వసీంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


వడ్డేపల్లి మండలం పైపాడులో వాల్మీకి జయంతిలో నాయకులు..


రాజోలి తహసీల్దార్ కార్యాలయం వద్ద..


ఇటిక్యాల మండల కార్యాలయంలో..


అయిజలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ దొడ్డెప్ప

వాల్మీకి చరిత్ర ఆదర్శనీయం: ఎస్పీ

దివ్యజ్ఞానంతో రామాయణ మహాకావ్యాన్ని రచించిన వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర అందరికీ ఆదర్శనీయమని ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గద్వాలలోని జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి ఎస్పీ నివాళి అర్పించారు. సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు, పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. శాంతినగర్‌లోని వాల్మీకి ఆలయం వద్ద, అయిజ పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న వాల్మీకి ఆలయంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. అయిజలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, పుర ఛైర్మన్ దేవన్న, అలంపూర్ మార్కెట్ యార్డు ఛైర్మన్ దొడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు. కేటిదొడ్డి మండలం నందిన్నె, కేటిదొడ్డి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, గద్వాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు.

-న్యూస్‌టుడే బృందం


వడ్డేపల్లి మండలం జూలేకల్‌లో..


అయిజలో ఎమ్మెల్యే విజయుడు, పుర ఛైర్మన్ దేవన్న, కౌన్సిలర్లు..


మానవపాడులో వాల్మీకి సంఘం ప్రతినిధులు, యువకులు..



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు..


అలంపూర్‌లో వాల్మీకి ఆలయం వద్ద పూజలు